ఈనాడు నాగర్‌కర్నూల్

ఆదివారం ఆగస్టు 30, 2026

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్

లోక్ అదాలత్ చక్కటి వేదిక

కందనూలు, న్యూస్‌టుడే: ఇరువర్గాల కక్షిదారులు తమ కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా న్యాయస్థాన సమావేశ మందిరంలో సెప్టెంబరు 12న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌పై పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌లో భూతగాదా, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకు రుణాల కేసులను కక్షిదారులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి నసీం సుల్తానా, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి నిహారిక, జూనియర్ సివిల్ న్యాయమూర్తి శృతిదూత, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎన్.శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

158 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో శనివారం 4 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన 2, దిగువన 2 టర్బయిన్లలో 158 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందన్నారు.

గుప్తనిధుల పేరిట విధ్వంసం

జిల్లాలో ఆగని తవ్వకాలు

లింగాల: పాత కోటగడ్డలో తవ్వకాలు జరిపిన ప్రాంతం

నిఘా

అచ్చంపేట న్యూటౌన్, లింగాల, న్యూస్‌టుడే: అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు వ్యక్తులు పురాతన ఆలయాలు, కోటలపై కన్నేసి తవ్వకాలకు పాల్పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట గుప్తనిధుల కోసం గుట్టుచప్పుడు కాకుండా అన్వేషణ సాగిస్తూ తవ్వకాలకు పాల్పడుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల పదర మండలంలోని ఉడిమిళ్లలో వజ్రాలు లభించాయంటూ సామాజిక మాధ్యమాల్లో కలకలం రేపిన సంగతి మరువక ముందే జిల్లావ్యాప్తంగా తవ్వకాలు జరిపిన మరికొన్ని సంఘటనలు జరిగాయి.

ఎక్కడెక్కడంటే..

- కల్వకుర్తి మండలంలోని తర్నికల్ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం చుట్టూ అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనించి స్థానిక రైతులు నిలదీశారు. గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు మేరకు తవ్వకాలకు ప్రయత్నించిన ఆరుగురిపై కేసు నమోదైంది.
- వెల్దండ మండలంలోని రాచూర్‌తండా సమీపంలో ఈ నెల 22న గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న ఘటనలో పొక్లెయిన్, ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసుల నివేదికలు చెబుతున్నాయి.
- కొల్లాపూర్ మండలంలోని సోమశిల-అమరగిరి శివారు మదరాసిగుండ్ల అటవీ ప్రాంతంలో ఈ నెల 26న తవ్వకాలు జరిపినట్లు సమాచారం తెలుసుకున్న రేంజ్ అధికారిణి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.
- ఇటీవల లింగాల మండల కేంద్రానికి సమీపంలోని చారిత్రక కట్టడాలపై కన్నేసిన కొందరు వ్యక్తులు చోళుల కాలంలో నిర్మించిన పురాతన కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలోని పాత కోటగడ్డ స్థలంలో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నా గనులు, రెవెన్యూ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్డీవో యాదగిరిని సంప్రదించగా లింగాల సమీపంలోని కోటగడ్డ తవ్వకాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

కోరింత.. పర్యావరణానికి చింత

- అడవిలో విస్తరిస్తున్న లాంటానా
- పట్టింపే లేని పరిస్థితి

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించే అడవుల అభివృద్ధికి కోరింత మొక్క(లాంటానా) అడ్డుపడుతోంది. అడవిలో వేగంగా విస్తరిస్తూ పర్యావరణంపై ప్రభావం చూపుతోంది. నిధుల కొరతతో లాంటానా తొలగింపు పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. దీంతో అడవిలో ఈ మొక్కలు వేగంగా విస్తరిస్తూ జీవవైవిధ్యానికి అడ్డుగా నిలుస్తున్నాయి.

అడవిలో ఏపుగా పెరుగుతున్న కోరింత మొక్కలు

వన్యప్రాణుల సంచారానికి ఆటంకం

కోరింత మొక్క రెండు మీటర్ల ఎత్తు వరకు గుబురుగా పెరుగుతుంది. నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 30 శాతాన్ని ఈ మొక్కలు ఆక్రమించాయి. ఇతర మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయి. గుబురుగా పెరిగే ఈ మొక్కలతో వన్యప్రాణులు తిరిగే మార్గాలు మూసుకుపోతున్నాయి. దీంతో వాటికి స్వేచ్ఛగా సంచరించే అవకాశం లేకుండా పోతోంది. పెద్దపులుల వేటకు సైతం ఆటంకాలు ఎదురవుతున్నాయి.

అటవీ శాఖ చర్యలు.. లాంటానా మొక్కలను తొలగించడం సులభం కాదు. మొక్క పైభాగాన్ని మాత్రమే తొలగిస్తే.. వర్షాలకు తిరిగి జీవం పోసుకుంటాయి. వర్షాల సమయంలో అటవీ అధికారులు ఈ మొక్కలను వేళ్లతో సహా తొలగించి మొక్కల పైభాగం నేలపై, వేర్లు పైపైపు ఉండేలా పడేస్తారు. దీంతో వర్షాలు వచ్చినా ఇవి తిరిగి జీవం పోసుకొనే వీలుండదు.

నీరు, పోషకాలు అందకుండా..

లాంటానా పరిసరాల్లోని మొక్కలకు నీరు, పోషకాలు అందకుండా చేస్తాయి. ఎక్కువగా వాడుకలో లేని నేలల్లో ఇవి వేగంగా పెరుగుతూ, ఆ ప్రాంతాన్ని ఆక్రమిస్తాయి. ఇతర మొక్కలను ఎదగనీయకుండా కొన్ని రసాయనాలను విడుదల చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్కలతో పశువులు, అడవిలోని శాకాహార జంతువులకు ఆహారం లభించని పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. కొన్ని రకాల ఔషధ మొక్కలు అంతరించిపోయే ప్రమాదముంది. తియ్యగా ఉండే వీటి పండ్లను పక్షులు, ఇతర చిన్న జంతువులు తిని గింజలను ఇతర ప్రాంతాల్లో విసర్జిస్తుండటంతో ఆ ప్రాంతంలో ఇవి మొలకెత్తి వేగంగా విస్తరిస్తాయి. వేసవిలో ఎండిపోయే ఈ మొక్కలు అడవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో మంటలను వేగంగా వ్యాపింపజేస్తాయి.

రూ.24 లక్షలు కేటాయించాం.. సఫారీ జోన్‌లో లాంటానా తొలగించేందుకు రూ.24 లక్షలు కేటాయించాం. పూత వచ్చే ముందే వరుసగా మూడేళ్లపాటు మొక్కలు తొలగిస్తాం. నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మంజూరైతే ఇతర ప్రాంతాల్లోనూ వాటిని తొలగిస్తాం. **- రేవంత్ చంద్ర, డీఎఫ్‌వో నాగర్‌కర్నూల్.**

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు, అధికారులు

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: విద్యార్థులు, క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ చెన్నయ్య అన్నారు. శనివారం యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో, పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్రీడాకారులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు.

సొంత వైద్యం.. ప్రాణాంతకం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: ఆసుపత్రులకు వెళ్లకుండా బాధితులు కొందరు సొంత వైద్యం చేసుకుని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. దుకాణాల్లో మందులను కొనుగోలుచేసి తెలిసీ తెలియని వైద్యంతో ఇక్కట్లకు గురవుతున్నారు. కొందరు చిన్న వయసులో గర్భం దాల్చి సొంత వైద్యంతో ప్రయోగాలు చేస్తున్నారు. వైద్యులను సంప్రదించకుండా, మందుల చీటీ లేకుండా ఔషధ దుకాణాల్లో కిట్లను వినియోగించి గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్నారు. కొన్ని దుకాణాల్లో అబార్షన్ కిట్లను అక్రమంగా నిల్వ చేస్తున్నారని తెలుసుకొని వాటిని కొనుగోలు చేసి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

ముదుగులో..రోడ్లపైన మృత శిశువులు.. తెలిసీ తెలియని వయసులో గర్భం దాల్చిన బాధిత మహిళలు సొంత వైద్యంతో గుట్టు చప్పుడు కాకుండా ప్రసవాలు చేసుకుంటున్నారు. గతేడాది డిసెంబరులో మగశిశువును పట్టణంలోని మల్లమ్మకుంట ముదుగులో పడేశారు. మూడు నెలల కిందట ఓ ఆడ శిశువును విద్యానగర్ కాలనీలోని చెత్త కుప్పలో పడేయడంతో కుక్కలు పీక్కుతిన్న ఘటనలు చోటు చేసుకున్నాయి. సంఘటనలపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా వదిలేశారు.

వైద్యశాఖ నిర్లక్ష్యంతోనే... వైద్యశాఖలో డ్రగ్ఇన్‌స్పెక్టర్ తనిఖీలు జరపకపోవడం, పర్యవేక్షణ లోపం వల్ల ఔషధ దుకాణాల్లో గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. అబార్షన్ కిట్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొన్ని దుకాణాల నిర్వాహకులు ఆదివారం వచ్చే అద్దె వైద్యుల సహకారంతో ఔషధాలను ఎక్కువ ధరలకు విక్రయిస్తూ...రోగులను మోసగిస్తున్నారు. అర్హత లేని వైద్యుల సహకారంతో కొన్ని ఆసుపత్రుల్లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు.

వైద్యుల సలహా లేకుండా వినియోగించొద్దు.. అర్హులైన వైద్యులను సంప్రదించకుండా, సలహాలు తీసుకోకుండా సొంత వైద్యం చేసుకోవడం అత్యంత ప్రమాదకరం. వైద్యుల సలహాలు లేకుండా ఔషధాలను వినియోగిస్తే ప్రాణాలకే ప్రమాదం. గర్భవిచ్ఛిత్తికి పాల్పడితే రక్తస్రావమై మహిళలు అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వైద్యులను సంప్రదిస్తే మంచిది. **-డా.మహేశ్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు**

రూ.27.32 కోట్ల ధాన్యం పక్కదారి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: శ్రీ గురుదత్తా ఇండస్ట్రీస్‌లో రూ.27.32 కోట్ల ధాన్యం పక్కదారి పట్టిందని డీఎస్వో, డీఎం ఆంజనేయులు ఫిర్యాదు మేరకు రైస్ మిల్లు యజమాని కొండూరు రాధిక నందకిశోర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ శనివారం తెలిపారు. రైస్‌మిల్లులో 7521.3644 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మొత్తం 1,88,034బస్తాలు పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు.

B.Ed Seats Available
For the Academic Year-(2026-28)
St. Mary's College
(MBNR)
Contact: 9000624135

ITI SPOT ADMISSIONS
ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం సం॥రమునకు రూ. 16,500/- మాత్రమే. ఈ క్రింది కోర్సులలో ప్రవేశం గలదు. 1) ఫిట్టర్, 2) ఎలక్ట్రానిక్ మెకానిక్ 3) ఎలక్ట్రీషియన్ 4) ప్లంబర్ 5) డీజిల్ మెకానిక్. 6) డ్రాఫ్ట్‌మెన్ సివిల్.
నోట్: COPA (కంప్యూటర్) కోర్సు 1 సం॥కు రూ. 13,200/-లు మాత్రమే.
మిగతా వివరాలకు
మార్కోని ITI, నల్లగొండ
శ్రీ శారద ITI, మిర్యాలగూడ
Cell: 98482 45036, 94900 97071, 94404 05112

దశదినకర్మ
చెరగని చిరునవ్వు, మానవత్వం, మంచితనంతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ మీ అకాల మరణం మాకు తీరనిలోటు. భౌతికంగా మీరు దూరమైనా మీ మధురస్మృతులు కలకాలం సజీవంగా నిలిచి ఉంటాయి. మీ పవిత్ర ఆత్మ శాంతికై భగవంతున్ని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ నడింపల్లి మోహన్‌రెడ్డి
డాక్యుమెంట్ రైటర్-కొల్లాపూర్
మరణం: 19-08-2026
భార్య: నడింపల్లి జయమ్మ
కుమారుడు-కోడలు
నడింపల్లి శిరీష్‌కుమార్‌రెడ్డి -కల్పన
మనుమరాళ్లు:
ఎన్.నేహా, ఎన్.నవ్య
కూతురు-అల్లుడు
గంగుల శిరీష-గంగుల కళాధర్‌రెడ్డి
మనుమడు : జి.వైభవ్‌రెడ్డి
మనుమరాలు: జి.అమోఘ
కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు
కార్యస్థలం: 30-8-2026 ఆదివారం రోజు మ॥ 12:30 గంటలకు మా స్వగృహం బండయ్యగుట్ట-కొల్లాపూర్ నందు జరుగును. సెల్: 9505254032, 9573534789

కూల్చివేతల జోరు.. ఒక్కరోజే హుషారు!

అక్రమ మిల్లులపై ఆగిన చర్యలు

ఈనాడు డిజిటల్ నాగర్‌కర్నూల్, వనపర్తి, కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : వనపర్తి జిల్లాలో కొందరు గ్రామ పంచాయతీల అనుమతులు లేకుండానే రైస్ మిల్లులు నిర్మించి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగించారు. వీరి గురించి సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. పైగా సదరు మిల్లులకు ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు జరిగాయి. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించడంలో విఫలమై డిఫాల్టర్ జాబితాలో చేరాయి. ఓ వైపు ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన వ్యవహారంలో లోపాలు కనిపిస్తుండగా.. మరో వైపు పంచాయతీకి రావాల్సిన పన్ను కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో కొన్ని రోజులుగా నేరుగా రాష్ట్రస్థాయి నుంచి విజిలెన్స్, ఈడీ అధికారులు సీఎంఆర్ డిఫాల్టర్లపై దృష్టి సారించి వరుస దాడులు చేస్తుండటంతో స్థానికంగా ఉన్న లోపాలు బయటపడుతున్నాయి.

కొత్తకోట : అక్రమంగా నిర్మించిన రైస్‌మిల్ షెడ్ రేకులు తొలగించారిలా..

అనుమానాలెన్నో..

- పెద్దమందడి మండలం మోజర్లలోని చాముండి రైస్‌మిల్, కొత్తకోట మండలం విలియంకొండలోని సాంబశివ రైస్‌మిల్ యజమానులు భవన నిర్మాణ అనుమతులు లేకుండానే నిర్మించారని జిల్లా అధికారులు గురువారం కూల్చివేతలు ప్రారంభించారు. వారికి నోటీసులు జారీ చేసినా ఎలాంటి సమాధానం రాకపోవడంతో చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.
- తొలి రోజు కూల్చివేతలు ప్రారంభించడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మరుసటి రోజు వచ్చి కూల్చివేతలు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు. వివిధ కారణాలు చెబుతూ రెండు రోజులుగా జాప్యం చేయడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం..

- పంచాయతీ, ఇతర చట్టబద్ధ అనుమతులను పరిశీలించకుండానే మిల్లులకు ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు ఎలా జరిగాయన్నది చర్చనీయాంశంగా మారింది.
- మిల్లుల నిర్మాణం జరిగి ఒకటి రెండేళ్లు, మరొకటి ఏడాది అవుతోంది. భవనాల నిర్మాణ ప్రారంభంలో పంచాయతీ అధికారుల చర్యలు తీసుకోకపోవడం, సాధారణ తనిఖీల్లో అనుమతులు లేవని గుర్తించినట్లు చెబుతుండటం అధికారుల పనితీరు ఏ విధంగా ఉందనడానికి ఇదే ఉదాహరణ.
- జిల్లాలో ఇలా ఎన్ని మిల్లులు ఉన్నాయి? వాటికి అన్ని అనుమతులు ఉన్నాయా లేవా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.
- ఇన్‌ఛార్జి డీపీవో రఘునాథ్ రెడ్డిని 'న్యూస్‌టుడే' ఫోన్లో సంప్రదించగా జిల్లాలోని మిల్లులకు అనుమతులు ఉన్నాయా? లేదా? అనేది పరిశీలిస్తున్నామని, ఒక వేళ అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పంచాయతీ బోరు.. అందరికీ అందని నీరు

రాయవరం గ్రామపంచాయతీ పరిధిలోని పాతరాయవరంలో పంచాయతీకి చెందిన నీటి సరఫరా బోరు ఇది. దీన్ని ప్రైవేటు వ్యక్తులు తమ వ్యవసాయ పనులకు వినియోగించడంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా బోరును వాడుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, లింగాల**

నేడు, రేపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), అలంపూర్, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆది, సోమవారాల్లో ఉమ్మడి జిల్లాలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం 7.15 గంటలకు అలంపూర్ జోగులాంబ ఆలయ సన్నిధిలో లైట్ అండ్ సౌండ్ షో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. మరుసటిరోజు సోమవారం ఉదయం 7 గంటలకు అలంపూర్ క్షేత్రంలో జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుంటారు. 9 గంటలకు జోగులాంబ రైల్వేస్టేషన్ పనులను తనిఖీ చేస్తారు. 10.30 గంటలకు గద్వాల రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 6 గంటలకు జడ్చర్లలోని రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తారు.

రైతులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

సేంద్రియ ఎరువులను పరిశీలిస్తున్న హేమంతకేశవ్‌పాటిల్

బిజినేపల్లి, న్యూస్‌టుడే: సాగులో నూతన వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కేవీకే సమన్వయకర్త డా.శైల కలెక్టర్‌కు స్వాగతం పలికి కేవీకే ఆధ్వర్యంలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను వివరించారు. రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించే నానోయూరియా, డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ, సేంద్రియ, జీవన ఎరువుల వాడకంపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై ఆరా తీశారు. రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గించడమే లక్ష్యంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి

మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా? అయితే వారికి అందించండి అభినందనల చందనాలు. ఆకాంక్షించండి వారి భావిజీవిత సుఖమయ ఆనందాలు. తెలియజేయండి ఈనాడు ద్వారా ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.
సంప్రదించండి :
మహబూబ్‌నగర్ : 8008709794, 8008882661, 8008550249
వనపర్తి : 8008709798 నాగర్‌కర్నూల్ : 8008705545
జోగులాంబ గద్వాల : 8008882662, నారాయణపేట: 7680076453

WESTERN ANDHRA TOLLWAYS PRIVATE LIMITED
A Portfolio Company of Interise Trust
INTERISE

శాఖాపూర్ టోల్ ప్లాజాలో తేది: 01-09-2026 నుండి అమలు కానున్న సవరణ రేట్లకు సంబంధించిన బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, లేఖ నం. **NHAI/RO-HYD /NH-44/AP-4/Shakapur/User Fee/E-257422/2026/1995 Dated: 07.08.2026** ప్రకారం సవరించిన టోల్‌ఫీజు రేట్లకు ఆమోదం తెలపడం జరిగింది. ఇట్టి సవరించిన టోల్‌రేట్లు ఎన్.హెచ్-44 (పాత NH-7) నందు (జడ్చర్ల నుండి కొత్తకోట బైపాస్) (80.050 కి.మీ.-135.740 కి.మీ) వరకు విస్తరించి ఉన్న రోడ్డులో తేది : 01-09-2026 (00.00 HRS) నుండి అమలు కాగలవు.

I. సవరించిన రుసుముల పట్టిక : (మొత్తం రూపాయలలో)

క్రమ సంఖ్య	వాహనము రకం	FASTAG ద్వారా మాత్రమే అందుబాటులో ఉన్నది		
		ఒకవైపు ప్రయాణం ఫీజు రూ॥	బహుళ ప్రయాణం ఫీజు రూ॥ (ఫీజు చెల్లింపు సమయం నుండి 24 గంటల వరకు వర్తించును.)	నెలసరి పాసు ఫీజు రూ॥
1.	కారు/ప్యాసింజర్/వ్యాను/జీపు/ తేలికపాటి మోటర్ వాహనం	85	125	2505
2.	చిన్న తరహా గూడ్స్ వాహనాలు లేదా మిని బస్సులు/ చిన్న తరహా వాణిజ్య వాహనాలు	145	220	4380
3.	ట్రక్కు/బస్సు (2-Axles)	290	440	8765
4.	అనేక ఇరుసు గల వాహనము (రెండు కన్నా ఎక్కువ ఇరుసులు)	470	705	14085

గమనిక :
- NHAI లేఖ నెం. NHAI/ PIU-MBNR/Toll Plazas/2026/524, తేది : 23-03-2026 ప్రకారం, జాతీయ రహదారి టోల్‌ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు 01-04-2026 నుండి నిలిపివేయబడ్డాయి. టోల్ ఫీజును Fastag లేదా UPI ద్వారా మాత్రమే చెల్లించాలి.
- అదనంగా, MoRTH నోటిఫికేషన్ నెం. G.S.R. 251(E), తేది: 02-04-2026 ప్రకారం, Fastag లేని వాహనాలు/ చెల్లని Fastag ఉన్న వాహనాలు UPI ద్వారా చెల్లింపు చేయడానికి ఎంపిక చేసుకున్నట్లయితే, 10-04-2026 నుండి వర్తించే వినియోగ రుసుములో 1.25 రెట్లు వసూలు చేయబడుతుంది.

2. టోల్ ప్లాజా నందు ఈ క్రింది రాయితీలు కలవు.
- అన్ని రకముల వాహనములకు బహుళ ప్రయాణ టికెట్ల రేటు, ఒకవైపు ప్రయాణ టికెట్టు రేటుకు 1.5 రెట్లు ఉండును. అట్టి టికెట్లు అట్టి వాహనమునకు తీసుకున్న తేది మరియు సమయము నుండి 24 గం॥ వరకు మాత్రమే వర్తించును.
- ఒక వాహనమునకు నెలసరి పాసుఫీజు, ఒకవైపు ప్రయాణమునకు 30 రెట్లు ఉండును. ఇట్టి పాసును అట్టి వాహనమునకు ఆ నెలలో ఎప్పుడైన ఎన్నిసార్లు అయినా వినియోగించుకునే సౌకర్యం ఉంటుంది.
- టోల్‌ఫీజు వసూలు చేయు టోల్‌ప్లాజాకు 10 కి.మీ. వ్యాసార్థ పరిధిలో ఉండే కారు/జీపు/వ్యాను యజమానులకు రాయితీ ద్వారా నెలకు రూ॥ 150/- వర్తించును. మరియు 20 కి.మీ. పరిధిలో ఉండే కారు/జీపు/వ్యాను యజమానులకు రూ॥ 300 వర్తించును.
- పాఠశాలల విద్యార్థులను తీసుకొని నిత్యం టోల్‌ప్లాజా గుండా ప్రయాణించే పాఠశాల బస్సులకు నెలకు రూ॥ 1000/- వర్తించును.

గమనిక: పైన తెలుపబడిన రాయితీ పాసులు, భారత ప్రభుత్వం జారీ చేయబడిన పాలసీ నెం. NHAI/13013/CO/2019-20/147464 తేది.15–1–2020 మరియు నెలసరి పాసుల నిర్వహణ/NHAI పాలసీ మార్గదర్శకాలు 2018, పాలసీ నెం.17.5.78 తేది.16–02–2018 ప్రకారం FASTAG ద్వారా మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

3. మినహాయింపు వాహనాల జాబితా భారత రాజపత్రం S.O.No.412(E) తేది: 06 ఫిబ్రవరి 2009 నందు ముద్రించబడిన ఫీ నోటిఫికేషన్‌లో కలదు.

4. నేషనల్ హైవే ఫీ (నిర్ణయించిన రేట్లు & వసూలు సవరణ రూల్స్) 2013, 2015 & 2018లో భారత రహదారుల మంత్రిత్వ శాఖచే ప్రచురింపబడిన రాజపత్రం నెం. G.S.R.778(E) తేది.16-12-2013, G.S.R.220(E) తేది.23-03-2015, G.S.R.920(E) తేది.25-09-2018 మరియు ఎన్.హెచ్.ఎ.ఐ. పాలసీ నెం.11041/218/2017-Admn తేది.31-12-2015 ప్రకారం ఒక వాహనానికి అనుమతింపబడిన సామర్థ్యము (స్థూల వాహన బరువు) కంటే అధిక బరువుతో జాతీయ రహదారిపై ప్రయాణించినచో వాహన రకమును బట్టి పది రెట్లు జరిమానా విధించబడును. మరియు అధికంగా ఉన్న బరువును (వాహనదారుని సొంత ఖర్చుతో) తొలగింపబడును.

5. సలహాలు, సూచనలు మరియు ఫిర్యాదులు చేయదలచినవారు. ఈ క్రింద తెలియజేసిన అధికారులను సంప్రదించగలరు.

	కన్షెషనర్	ఇండిపెండెంట్ ఇంజినీర్	ఎన్.హెచ్.ఎ.ఐ. కార్యాలయం
	పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	టీమ్ లీడర్	ప్రాజెక్ట్ డైరెక్టర్– PIU మహబూబ్‌నగర్
చిరునామా	M/s వెస్ట్రన్ ఆంధ్రా టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్, కి.మీ. 114.850 శాఖాపూర్ గ్రామము, అడ్డాకల్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా - 509382	M/s ఆర్వి అసోసియేట్స్ ఆర్కిటెక్ట్స్ ఇంజినీర్స్ & కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, Door No : 23-99/3, ప్లాట్ నెం. 401& 402 రోడ్ నెం.5, మధురనగర్, శంషాబాద్ - 501218	H.No. 10-4-32/c/2, ఎనుగొండ బైపాస్ రోడ్, వినాయకనగర్ కాలనీ, మహబూబ్‌నగర్- 509002
☎ నం.	9392898964	040–29553157	08542–293573

జాతీయ రహదారులపై సహాయం కొరకు 1033కి కాల్ చేయండి

(c) eenadu

బస్‌షెల్టర్ లేక బాధ

మండలంలోని తెలంగాణ కూడలిలో బస్టాప్ ఏర్పాటు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కూడలి దగ్గర బాలికల గురుకుల పాఠశాల ఉండటంతో పలు గ్రామాల నుంచి విద్యార్థులను కలవడానికి తల్లిదండ్రులు వస్తుంటారు. ఆర్డినరీ బస్సులు కూడా ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, దాతలు, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తెలకపల్లి**

కంపచెట్ల మాటున.. కనిపించని ప్రమాదం

పట్టణంలోని జాతీయ రహదారి-44 కొత్తకోట బైపాస్ సమీపంలోని వాగుపై వంతెన ప్రమాదకరంగా మారింది. కొద్ది నెలల క్రితం వంతెన రక్షణ గోడను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం పొంచి ఉంది. మరోవైపు వంతెన కింద కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కూలిన రక్షణ గోడలు కనిపించడం లేదు. చోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాగులో పడిపోయే అవకాశం ఉంది. కూలిన రక్షణ గోడ దిమ్మెలు మిషన్ భగీరథ పైపులైన్‌పై పడటంతో పైపులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

శ్రీశైలానికి 9,722 క్యూసెక్కుల ప్రవాహం

బ్రహ్మగిరి(అమ్రాబాద్), న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి ఎగువన ఉన్న జూరాల నుంచి వరద కొనసాగుతోంది. శనివారం 9,722 క్యూసెక్కుల ప్రవాహం జలాశయాన్ని చేరింది. దీంతో సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 872.50 అడుగులు, నీటి నిల్వ 152.1568 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 3,050, ఎంజీకేఎల్ఐకి 2,400, పోతిరెడ్డిపాడుకు 8,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

"ఈ శ్రావణ మాసంలో.. మీ ఈనాడు పెళ్లిపందిరితో.. సంతోషకరమైన పెళ్లిళ్లకు శ్రీకారం!"

- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహితులకు సువర్ణావకాశం
- నేడు కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు (అన్ని కులాల) అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు సంబంధిత కుటుంబీకులు నేడు (30 ఆగస్టు 2026 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. **మరిన్ని వివరాలకు 9154340820 & 9154992572 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.** • ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ మరియు యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన వాట్సాప్ నెంబర్లకు పంపవచ్చు **Note:** ఈ శ్రావణ మాసంలో ప్రతి ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ నమోదుతో • ఒక నెల ప్రొఫైల్ హైలైటర్ (మీ ప్రొఫైల్‌ను ఎక్కువ మంది చూసుకునే అవకాశం) • అపరిమిత ఎక్స్‌ప్రెస్ ఇంట్రెస్టులు (మీకు నచ్చిన సంబంధాలకు ఆసక్తి తెలియజేసే అవకాశం)

చారకొండలో హీరో శర్వానంద్ హల్‌చల్

చారకొండ, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శనివారం సినీ నటుడు శర్వానంద్ రాకతో సందడిగా మారింది. మండల పరిధిలోని జేపల్లి గ్రామ శివారులో సర్వే నంబరు 148లో 25 ఎకరాల వ్యవసాయ భూమిని ఇటీవల ఆయన కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ మూడావత్ ఉమ ఆధ్వర్యంలో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగింది.

పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ ఉమ

అన్న మరణవార్త విని తమ్ముడి మృతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఒకే తల్లికి పుట్టి, కలిసి పెరిగిన అన్నదమ్ములు మరణంలోనూ కలిసే అనంతలోకాలకు పయనమయ్యారు. ఈ విషాద ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని పెరుమాండ్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సల్కూటి సింహారెడ్డి(68) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తమ్ముడు సల్కూటి లింగారెడ్డి(64) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం తన అన్న చనిపోయాడని తమ్ముడికి సమాచారం అందించారు. దీంతో ఆయన పది నిమిషాల్లోనే మృతి చెందారు. సాయంత్రం గ్రామంలో అన్నదమ్ముల భౌతికకాయాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఒకే రోజు అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

లారీ కిందపడి మహిళ దుర్మరణం

రాఖీ పండుగకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం

నందిగామ, న్యూస్‌టుడే: రాఖీ పండుగకు కుమార్తె ఇంటికి వెళ్లిన తల్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటన షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలం ధన్‌సింగ్‌తండా బైపాస్ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఎస్సై దేవ్‌రాజ్ వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన దంపతులు మహేశ్వర్జీ, అరుణబాయి(42) రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం కర్మన్‌ఘాట్‌లో ఉన్న తమ పెద్ద కుమార్తె వద్దకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై తిమ్మాజిపేట వైపు వస్తున్నారు. ధన్‌సింగ్ తండా శివారు బైపాస్ రహదారిపై వెనక నుంచి వస్తున్న లారీ టైరు పేలడంతో అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణబాయి కిందపడ్డారు. లారీ టైరు ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో తలకు బలమైన గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. భర్త మహేశ్వర్జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అదే మార్గంలో ప్రయాణిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి ప్రమాదం జరిగిన తీరును చూసి చలించిపోయారు. వాహనం దిగి బాధితులకు తక్షణ సహాయం అందించాలని పోలీసులకు సూచించారు.

అరుణబాయి

బరిలో దిగితే.. పతకాలే

కల్వకుర్తి, న్యూస్‌టుడే: బోటింగ్ చేయడమంటే సాహసమే. సెయిలింగ్ చేస్తూ ప్రత్యర్థులతో పోటీ పడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రాణిస్తోంది మీనిగ అక్షర. ఖోఖోలో చాకచక్యంతో ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ పతకాలు సాధించేందుకు నిత్యం సాధన చేస్తోంది మంగలి శ్రీలక్ష్మి. వారు కల్వకుర్తి పట్టణ ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో చదువుతున్నారు. ఉపాధ్యాయిని సింధు వారికి తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

సరదాగా ఆడిన ఆటలో గుర్తింపు

సరదాగా ఆడిన ఆట నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం నక్కలవారిపల్లికి చెందిన **మంగలి శ్రీలక్ష్మి** పదో తరగతి చదువుతున్నారు. ఎనిమిది సార్లు జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. 2024లో తమిళనాడులో నిర్వహించిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. కర్ణాటకలో నిర్వహించిన సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 2024లో ఝార్ఖండ్, 2025లో ఒడిశాలో జాతీయ పోటీలు, కర్ణాటకలో నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. 2025లో తమిళనాడు, కర్ణాటకలో జాతీయ జూనియర్ పోటీల్లో కాంస్యం సాధించారు. 2026లోవరంగల్‌లో జరిగిన నేషనల్ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల్లో శ్రీలక్ష్మి ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఏడాదికి గానూ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందజేసింది. ఉన్నతస్థానం చేరుకోవడమే లక్ష్యమని శ్రీలక్ష్మి తెలిపారు.

సెయిలింగ్‌లో దూసుకెళ్తూ : జాతీయ స్థాయి సెయిలింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతోంది వనపర్తి జిల్లా కేతపల్లికి చెందిన **మీనిగ అక్షర** తొమ్మిదో తరగతి చదువుతోంది. 2025లో మాన్‌సూన్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2025 సికింద్రాబాద్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రజతం సాధించారు. 2024 ఇండిపెండెంట్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడలకు ఎంపికయ్యారు. మల్టీక్లాస్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ భోపాల్‌లో జరిగిన జాతీయ క్రీడలో పాల్గొంది. 2026లో నార్త్ ఈస్ట్ రేగట్ట మేఘాలయలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపారు. వైఏఐ యూత్ నేషనల్ మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. 2026లో మాన్‌సూన్ రేగట్ట హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. 2026లో క్యాడెట్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. 2026లో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు.

అలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహామంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: దేశ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. శనివారం స్థానిక భాజపా కార్యాలయంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో అత్యధికంగా మత ఘర్షణలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయని పేర్కొన్నారు. ప్రధానిగా వాజ్‌పేయీ హయాం నుంచి నేటి నరేంద్రమోదీ వరకు దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. కేంద్రంలో భాజపా హయాంలోనే మైనార్టీలకు నిజమైన రక్షణ, విద్య, ఉద్యోగ, సంక్షేమరంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని మైనార్టీ మోర్చా నేతలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస హయాంలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అధికారంలో ఎవరుంటే వారికి వత్తాసు పలుకుతూ మజ్లిస్ పార్టీ చీకటి ఒప్పందం చేసుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. క్రిస్టియన్, మైనార్టీల్లో మతతత్వ పార్టీ అని భాజపాపై విద్వేషం పెంచుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, భారాస నాటకాలను నమ్మకుండా దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మైనార్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశంలో మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని వివరించారు. సమావేశంలో భాజపా, మైనార్టీ మోర్చా రాష్ట్ర, జిల్లా నేతలు పద్మజారెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ, ఎ.అంజయ్య, అఫ్సర్‌పాషా, మహబూబ్‌అలీ, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రామచందర్‌రావు, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగ్‌మోహన్‌సింగ్ తదితరులు

క్రీడలపై విద్యార్థులకు పెరుగుతున్న ఆసక్తి

పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు రావడమే కాకుండా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అందుకోసం నేటి తరం విద్యార్థులు ఆటలపై దృష్టి సారిస్తున్నారని పీయూ వీసీ డా. జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పీయూలో మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే జీవితంలో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఖేలో ఇండియా ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఇప్పటికే తమ వర్సిటీ నుంచి ఎం.ప్రవల్లిక 200 మీటర్ల పరుగులో జాతీయ స్థాయిలో స్వర్ణం, ఎన్.విష్ణువర్ధన్ ఆర్చరీలో రెండు జాతీయ స్థాయి స్వర్ణ పతకాలు, ఎన్కే గీత జాతీయ స్థాయిలో రజతం సాధించారని గుర్తు చేశారు. అంతరం ఆయా క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులను వీసీ ఘనంగా సన్మానించారు. పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, పీడీ శ్రీనివాసులు, నూర్జహాన్, కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, సంధ్యారాణి, రవికుమార్, రాజశేఖర్, గౌస్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

క్రీడాకారుడిని సన్మానిస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు తదితరులు

లభించని శ్వేత ఆచూకీ

వీపనగండ్ల, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో చిక్కుకొన్న వీపనగండ్లకు చెందిన శ్వేత పుట్ట గురించి శనివారం వరకు ఎలాంటి సమాచారం లభించక పోవడంతో కుటుంబంలో, గ్రామంలో ఆందోళన నెలకొంది. భర్త సురేశ్‌రెడ్డి, కుమారుడు అనీశ్‌రెడ్డితో కలిసి అమెరికాలో స్థిరపడిన ఆమె ఈనెల 12న ఈశా ఫౌండేషన్, ఈశా గ్రూప్ ఏజెన్సీల ఆధ్వర్యంలో అధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. పర్యటన ముగించుకొని ఈనెల 25న ఆమె హైదరాబాద్‌కు వచ్చి, రెండు రోజుల పాటు ఉండి 29న అమెరికాకు బయలుదేరాల్సి ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. పర్యటన ముగించుకొని ఈనెల 25న ఉదయం కాఠ్‌మాండూకు చేరుకునేందుకు టిబెట్ వద్ద ఉండే కార్యాలయంలో అనుమతి కోసం వెళ్లగా.. అప్పుడే భారీ వరదలు సంభవించినట్లు తెలుస్తోంది. ఆమె క్షేమ సమాచారంపై ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మనోవేదనకు గురవుతున్నారు.

నేటి నీట్ పీజీకి సర్వం సిద్ధం

- రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు
- హాజరుకానున్న 360 మంది అభ్యర్థులు

పాలమూరు, న్యూస్‌టుడే: నీట్ పీజీ - 2026 అర్హత పరీక్షకు మహబూబ్‌నగర్ జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 360 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో 180 మంది, ధర్మాపూర్ సమీపంలోని జయ ప్రకాశ్‌నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులకు పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్ష విధానం అంతా అంతర్జాలంలో రాయాల్సి ఉంటుంది. అభ్యర్థులను ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 8.30 గంటలకు గేట్లు మూసేస్తారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. చరవాణులు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ భద్రతను కల్పిస్తున్నారు.

ఫాతిమా విద్యాలయంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఇద్దరు అధికారులకు బాధ్యతలు : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నీట్ -పీజీ పరీక్ష కోసం రెండు కేంద్రాలకు ఇద్దరు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఫాతిమా విద్యాలయం వద్ద మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్, జేపీఎన్‌సీఈ వద్ద ఆర్డీవో నవీన్ పర్యవేక్షించనున్నారు. విద్యుత్తు అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేశారు.

ఆలస్యమైతే.. ద్విచక్ర వాహనాలతో సిద్ధంగా : అనివార్య కారణాల వల్ల ఆలస్యంగా వచ్చే అభ్యర్థులను సకాలంలో పరీక్ష కేంద్రాలకు తరలించడానికి తొలిసారిగా గ్రామ పంచాయతీ అధికారుల (జీపీవోలు)ను నియమించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఐదుగురు, రైల్వేస్టేషన్‌లో మరో ఐదుగురు జీపీవోలు అందుబాటులో ఉంటారు. హెల్ప్ యూ-నీట్ 2026 పరీక్ష అని బోర్డులతో వీరు ద్విచక్ర వాహనాలతో సిద్ధంగా ఉంటారు. ఇలా సిబ్బందిని నియమించడం ఇదే మొదటిసారి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ వినూత్నంగా ఆలోచించి అభ్యర్థులకు మెరుగైన సేవలు అందించేలా ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఎవరైనా అనారోగ్యానికి గురైతే పరీక్ష కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఔషధాలతో సేవలు అందించనున్నారు.

శాఖల సమన్వయంతో..

'న్యూస్‌టుడే' వివరణ కోరగా అన్ని పరీక్షలు సజావుగా నిర్వహించడానికి శాఖలు సమన్వయం చేసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశాం. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

- మధుసూదన్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

క్రీడా దినోత్సవం.. విద్యార్థుల సంబరం

రాజోలి, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవాన్ని రాజోలి కేజీబీవీ, మాన్‌దొడ్డి ఉన్నత పాఠశాలల్లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. కేజీబీవీలో బాలికలు హాకీ ఇండియా ఆకారంలో కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. మాన్‌దొడ్డిలో జీహెచ్‌ఎం హరుణ్‌రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను సర్పంచి సుజాత ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

హాకీ ఇండియా ఆకారంలో బాలికలు

రక్షాబంధన్ వేడుకలకు హాజరు

వెల్దండ, న్యూస్‌టుడే: న్యూదిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షాబంధన్ వేడుకల్లో వెల్దండ మండలం గుండాల ఏకలవ్య గురుకుల విద్యార్థిని ఎ.వైష్ణవి పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19 మంది విద్యార్థులు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు రాఖీ కట్టే కార్యక్రమానికి అవకాశం లభించగా... తొమ్మిదో తరగతి చదువుతున్న వైష్ణవికి ఆహ్వానం అందింది. రాష్ట్రపతితో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో వైష్ణవి పాల్గొనడంపై ప్రిన్సిపల్ సుమన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, ఉపాధ్యాయులు సుధీర్‌నాయక్, రీనా, అనీషా, గీతు, చంద్రన్ హర్షం వ్యక్తం చేసి విద్యార్థినిని అభినందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

Wanted Gujarat based FMCG Chocolate Pvt. Ltd. Co. Need Districts wise Super Stockist, Area wise Distributors & Sales Officers. Ph: 7993608649

ఫ్రీ లాంచింగ్ ప్రొడక్ట్ బేసిడ్ ఇన్వెస్ట్‌మెంట్, బైనారి బిజినెస్ కాన్సెప్ట్ స్త్రీ/పు. నిరుద్యోగులు, MLM, మార్కెటింగ్ లీడర్స్ లక్షల్లో వీక్లీటీమ్ సంపాదన. ✆ 7013203996.

FINANCIAL SERVICES

లేక్‌ల్యాండ్ కంపెనీ - అన్నిలోన్లు ప్రాపర్టీ, LAP, బిజినెస్, వ్యవసాయ, టేకోవర్ పర్సనల్, గ్రూప్ లోన్లు @ 7% వడ్డీ. ఏజెంట్లు కావలెను. మంచి కమీషన్. 8961920779

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

HOUSE FOR SALE

House for sale 161 yards, West facing, 2BHK DTCP layout,30 feet road, quality construction, 200 mtrs to Bypass ✆9121668012

New G+1 House For Sale, Northeast Facing, 150 Sq.Yds, Backside Of Pista House, MBNR. ✆ 99669 75125, 86393 31798

2BHK, పోర్టికో తూర్పు ముఖంగా ఉన్న ఇల్లు అమ్మకానికి ఉంది. గోల్డెన్ అపార్ట్‌మెంట్స్ బ్యాక్ సైడ్, టీచర్స్ కాలనీ, MBNR ✆ 9704583320/8466891675

LAND FOR SALE

Tamilnadu Arunachala (Tiruvannamalai) 5.87 Acres Sale. Suitable for Ashrams, Institution, Farm Houses. ✆ 9840651404.

2Acers Commercial Land for Sale @ Srisailam H/W Facing Nr Dindi Project Tollplaza Usefull for Hotel, Daba, Farm House. 95022 66888, 9440147855.

భూమి అమ్మకానికి కలదు. తెలంగాణ రాష్ట్రం, నాగర్‌కర్నూల్ జిల్లా, దేశిఇటిక్యాల గ్రామంలో కొల్లాపూర్ చౌరస్తాకు దగ్గరలో NH-167K కు 500 మీటర్ల దూరంలో 3 ఎకరాల మెట్ట భూమి అమ్మకానికి కలదు. ఆసక్తి గల వారు సంప్రదించగలరు. ఫోన్: 9966738603

MANGO FARM for sale
12.5 Acres,
RTC Bus Route Road,
Near SIDDIPET- MUSTABAD
"T" JUNCTION,
WITH 3 BORE WELLS.
TOTAL FENCING
PH:9391515600

PLOT FOR SALE

Mahabubnagar, Yenugonda, Opp: SVS Medical College Hostel, Sriram Nagar Colony, 400 Sq.Yds. 2 Sides Road. ✆ 9985599945.

మహబూబ్‌నగర్ టౌన్ అప్పన్నపల్లిలో పోచమ్మ టెంపుల్ వెనుక 236 గజాల North/East face గల ప్లాటు అమ్మబడును సెల్: 9866308535

LEASE

G+3 neat Bldg.Location: Behind Mallikarjuna Enterprises New Town (Skill India Bldg.) with Cellar, 10,000 Sft. for Lease for Offices, Bank, Financial Instt., College Etc., interested Pl. Contact to Mob: 9100389060

LEASE/ RENT

Commercial Space for rent at Erra Satyam Chowrasta Circle, G+2 Floors, Pent House. Contact: 9705655944

TO LET

న్యూటౌన్ X రోడ్ దగ్గర యం.నగర్ లో 325 Sqft గల shop అద్దెకు ఇవ్వబడును. Contact: 8790373595 / 9963345543

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

మహబూబ్‌నగర్ హాస్పిటల్ ఫార్మసీ లో పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు కావలెను. Contact Number: 9689689115

హైదరాబాద్ సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంట చేయడానికి బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీ॥ 25K-30K, భోజనము+వసతి కల్పించబడును. వెంటనే ✆ 9866252220

మ.నగర్ జిల్లా ప్రముఖ ఏజెన్సీ నందు పనిచేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను, మంచి జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 93987 24094

వంటమనిషి కావలెను వసతి భోజన సౌకర్యం కలదు, జీతం: 10,000 to 12,000 వరకు, సిద్ధార్థ మోడల్ స్కూల్ తెల్కపల్లి, నాగర్‌కర్నూల్ ✆ 9705076876

Hyd,**ఆటోనగర్ మెడికల్** ఏజెన్సీలో చేయుటకు Exp.గల కంప్యూటర్ ఆపరేటర్లు 2& ప్యాకింగ్ హెల్పర్స్, 4వీలర్ డ్రైవర్లు, హౌస్‌కీపింగ్ వర్కర్లు కావలెను.9490044041

ఆర్వి డిజిటల్స్ - తిరుపతి నందు పనిచేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్ (ఫోటోషాప్, కోరల్ డ్రా తెలిసిన వారు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 86880 56789.

Exp. **ఆయాలు** / వార్డ్ బాయ్స్ నర్సులు కావలెను. జీతం: 21000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. Ph: 8096770770/ 9985601234.

Hyd**లోని ప్రముఖ** టిఫిన్ సెంటర్ లో స్టాల్‌బాయ్స్, సూపర్ వైజర్స్ (ఫ్రెష్/Exp) కావలెను. జీ: 18K, 12గం॥ ఫ్రీ వసతి + భోజనం. 9666934949/9963165905.

సేల్స్ బాయ్స్ & సేల్స్ గర్ల్స్ యం.నగర్ లో బొంబే గార్మెంట్స్‌లో పని చేయుటకు అనుభవం గల వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం సెల్: 7981453208

WANTED

హైదరాబాద్ లోని ఇబ్రహీంపట్నం దగ్గరలో ఉన్న మా ఫామ్ ల్యాండ్ లో రెండు కుటుంబాలు ఉన్నాయి. వారు వివిధ రకాల పనులు చేస్తుంటారు.

ఆ కుటుంబాలు చేసే పనులు సూపర్‌వైజు చేయడానికి ఒక **ఇంచార్జ్** కావాలి.

నెలకు జీతము 30,000.
వయస్సు 25 నుండి 40 సం॥ లు.
అర్హత - ఇంటర్మీడియట్,

ఏదైనా రంగంలో ఇంచార్జ్ కానీ సూపర్వైజర్ గా కానీ పనిచేసిన అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు 31-08-26, 01-09-26 & 02-09-26, టైమింగ్స్: ఉ. 10 నుండి 6 సా.

ఇంటర్వ్యూ కొరకు ఫోటోలు తీసుకొని రాగలరు.

సంప్రదించండి : కామినేని హాస్పిటల్ దగ్గర, సూర్యోదయ కాలనీ, L.B.నగర్, హైదరాబాద్. Ph. 7842226933.
Mail : hradmin@sribalajiads.in

FACULTY/ TEACHERS

Wanted Lady Teachers: To teach primary class subjects. In English Medium school, Bhoothpur, MBNR. Cell No: 9441292465

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar
8008709794

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

36వ జన్మదిన శుభాకాంక్షలు
శ్రీశ్రీశ్రీ పంచమ శిద్దలింగ మహాస్వామి గారికి జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీశ్రీశ్రీ పంచమ శిద్దలింగ మహాస్వామి
నేరెడగం మఠం, మాగనూర్ మం॥ నారాయణపేట జిల్లా
అపర్ణ ఫొటో స్టూడియో మక్తల్, 9441049257
కె.పాపిరెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
నాగర్‌కర్నూలు : 7993300530
అచ్చంపేట : 8008573927
కల్వకుర్తి : 8008573884
కొల్లాపూర్ : 8008573870

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: ?: పురపాలిక పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో చేపల విక్రయాలతో దుర్వాసన, ఈగలు వ్యాపిస్తున్నాయి. పందులు, కుక్కలు చేరడంతో ఇబ్బందిగా మారింది. అక్కడ విక్రయాలు జరగకుండా పుర అధికారులు చర్యలు తీసుకోవాలి.- **అయ్యప్ప భక్తులు, అచ్చంపేట** ✔: దేవాలయం వద్ద నుంచి చేపల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - **గణేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అచ్చంపేట.** **కొల్లాపూర్, న్యూస్‌టుడే:** ?: పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలోని తాగునీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రత నెలకొంది. నీళ్లు నిలిచి మురుగు పెరిగింది. పిచ్చిచెట్లు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలి. - **వెంకటస్వామి, కొల్లాపూర్ పట్టణం** ✔: ట్యాంకు ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపడతాం. - **శంకర్, కమిషనర్, కొల్లాపూర్ పురపాలిక**

తెరపై ఈనాడు

అచ్చంపేటలో... సాయిరాం: **టాక్సిక్**, సత్యలక్ష్మి: **ఇరుముడి**, కల్వకుర్తిలో...: అశోక్: **టాక్సిక్**, పార్థసారథి: **ఇరుముడి**, నాగర్‌కర్నూల్‌లో...: రవి: **టాక్సిక్**

పెచ్చుమీరిన నిర్లక్ష్యం.. బడికెళ్లాలంటే భయం

శిథిల భవనాల్లో విద్యార్థుల అవస్థలు

ఊర్కొండ: జకినాలపల్లి ప్రాథమిక పాఠశాల తరగతి గది దుస్థితి

న్యూస్‌టుడే పరిశీలన

ఉప్పునుంతల, బిజినేపల్లి, ఊర్కొండ, వంగూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. వర్షం వస్తే నీరు కారడంతోపాటు పైకప్పులు పెచ్చులూడుతూ ఊచలు దర్శనమిస్తున్నాయి. వర్షాలకు గదుల్లోకి నీరు వస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. భవనాల గోడలు అధ్వానంగా మారడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిన్నారులు భయం నీడనే చదువుతున్నారు. ఏళ్ల తరబడి కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 498, ప్రాథమికోన్నత 124, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 130 ఉన్నాయి. వీటిలో 49 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. శిథిల భవనాల్లో విద్యార్థుల ఇబ్బందులపై న్యూస్‌టుడే 'పరిశీలన' కథనం..

ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయంటే...

- వంగూరు మండలంలోని కోనేటిపూర్, తిరుమలగిరి, పోతారెడ్డిపల్లి, డిండిచింతపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు శిథిలమై అధ్వానంగా తయారయ్యాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయపడుతున్నారు.
- బిజినేపల్లి మండలంలోని పాలెం జడ్పీ ఉన్నత పాఠశాల భవనం చాలా పురాతనమైంది. ఇక్కడ 500 మంది విద్యార్థులున్నారు. గదుల పైకప్పు రేకులు దెబ్బతినడంతో వర్షపు నీరు లోపలికి వస్తోంది.
- ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి, జకినాలపల్లి, ముచ్చర్లపల్లి, ఊర్కొండపేట ప్రాథమిక పాఠశాలలు, రాంరెడ్డిపల్లి, జగబోయిన్‌పల్లి, ప్రాథమికోన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిల్లో విద్యార్థుల భయంతో చదువులను కొనసాగిస్తున్నారు.
- ఉప్పునుంతల మండలంలోని మర్రిపల్లి, తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల పైకప్పులు సిమెంటు తొలగిపోయి ఊచలు కనిపిస్తున్నాయి. వానొస్తే నీరు గదుల్లోకి వస్తోంది. గోడలు తడిసి దెబ్బతింటున్నాయి. ఉప్పునుంతల బాలికల ప్రాథమిక పాఠశాల పాత భవనం శిథిలమైంది. గదుల్లో పైకప్పు దెబ్బతింది.

ఉప్పునుంతల: ఊచలు తేలిన మర్రిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

నిధులున్నా.. నిర్మాణంలో జాప్యం

వెల్దండ మండల కేంద్రం నుంచి పోతేపల్లికి వెళ్లే కొత్త రహదారిపై సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయ భూగర్భ కాల్వ నిండి పోయి మురుగంతా ప్రవహిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భూగర్భ కాల్వ నిర్మాణం గానీ, ఉన్నదానికి మరమ్మతులు గానీ చేపట్టాలని అంతా కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కల్వకుర్తి న్యూటౌన్**

కార్యాలయం.. వరాహాలకు ఆవాసం

కొల్లాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వరాహాలకు నివాసంగా మారింది. రోజూ వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలకు ఆవరణలో పందులు కనిపిస్తుండటంతో అధికారులపై మండిపడుతున్నారు. అధికారులు విధులు నిర్వహిస్తున్న సమయంలోనే అవి కనిపిస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ఆవరణలో పందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కొల్లాపూర్ న్యూటౌన్

జనసేన ఆత్మీయ సమావేశం

ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: జనసేన ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఉయ్యాలవాడ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం జరిపారు. పార్టీ బలోపేతంపైనా, భవిష్యత్తు కార్యాచరణపైనా చర్చించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యకర్తల మధ్య ఆత్మీయతను పెంపొందించేలా ఉండాలని నాయకులు పేర్కొన్నారు. జనసేన నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తాడూరు, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజా పాలన ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్డులను పంపిణీ చేశారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, విండో ఛైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచి సంద మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు పరామర్శ

తెలకపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో బాలసంఘం కాలనీలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వార్డు సభ్యుడు కొమ్ము ఎల్లస్వామి, రాకొండలో సర్పంచి బిజ్జ స్వామి తల్లి తిరుమలమ్మ(80) అస్వస్థతకు గురై ఉదయం చనిపోయారని తెలుసుకుని ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, డీలర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

వంగూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ హెచ్చరించారు. శనివారం మండలంలోని రైతువేదికలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలం వంగూరులో 11,569 రేషన్‌కార్డులు ఉండగా.. స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీకి కనీసం వెయ్యి మంది కూడా హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న వంశీకృష్ణ

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దిమడుగు ఆంజనేయస్వామి క్షేత్రానికి సమీపంలో సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. హరిత హోటల్ నిర్మాణానికి రూ. 15 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. పదర, అమ్రాబాద్, బల్మూరు, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో రాజీవ్ మినీ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆరు నెలల్లో చెన్నకేశవ ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మూల్యాంకనంలో మార్పులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల స్థాయి పరీక్షల మూల్యాంకన విధానంలో మార్పులు చేసినట్లు డీఈవో రమేశ్‌కుమార్ శనివారం తెలిపారు. పాఠశాలల్లో నాలుగు ఎఫ్ఏలు, రెండు ఎస్ఏ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షల మూల్యాంకనం పాఠశాలస్థాయిలో కాకుండా మండలస్థాయిలో నిర్వహించేలా మార్పులు చేశారని పేర్కొన్నారు. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల సమాధాన పత్రాలను సీలు వేసి ఎంఈవోలకు పంపాల్సి ఉంటుందన్నారు. ఎంఈవో పర్యవేక్షణలో 1-9 తరగతుల సమాధాన పత్రాల మూల్యాంకనం కోసం నిపుణులను నియమిస్తామని అన్నారు. పరీక్షల విధానంలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వంగూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 33-11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు మండల విద్యుత్తు శాఖ అధికారి మేఘనాథ్‌నాయక్ శనివారం వెల్లడించారు. వంగూరు, తుమ్మలపల్లి, వెల్మలపల్లి, గాజర, మల్లు అనంతరాములు కాలనీ, ఉల్లంపల్లి, తిప్పారెడ్డిపల్లి, వెంకటాపూర్, ఉమ్మాపూర్ తదితర గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

నోటీసుల జారీలో పొరపాట్లు వద్దు: కలెక్టర్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: ఓటర్లకు నోటీసులు జారీ చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నోటీసుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలన్నారు. సంబంధిత వ్యక్తులకు మాత్రమే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికీ 75 శాతం ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ చెన్నయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న హేమంత కేశవ్ పాటిల్

నేత్రపర్వంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

విగ్రహాలకు పూజలు చేస్తున్న సర్పంచి దంపతులు, భక్తులు

ఉప్పునుంతల, న్యూస్‌టుడే: మండలంలోని గువ్వలోనిపల్లిలో రుద్రాంశ సహిత రామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మూలమంత్ర హావనం, విగ్రహాలకు ధాన్య, పుష్ప శయ్యాదివాసములు నిర్వహించారు. దేవి ఉపాసకుడు ఆచార్య గౌరయ్యస్వామి ఉపన్యాసం ఇచ్చారు. సాయంత్రం అష్టోత్తర శతకలశాభిషేకం, గర్తన్యాసం కార్యక్రమాలు జరిపారు. స్థానికులు సహా పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సర్పంచి పానుగంటి శ్రీదేవి దంపతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోనాల పండుగ: ఉప్పునుంతల, న్యూస్‌టుడే: ఉప్పునుంతలలో వచ్చేనెల 2 నుంచి బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు సర్పంచి చింతగాళ్ల శ్రీనివాసులు శనివారం తెలిపారు. 2, 3 తేదీల్లో బోనాల ఉత్సవాలు, 4న వనప్రవేశం, అదే రోజు రాత్రి శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు, 5న ఉట్లు కొట్టే ఉత్సవం, అనంతరం గ్రామంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే: బిజినేపల్లి మండలం పాలెంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. అర్చకులు జయంత్, శుక్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో చెలగాటం తగదు

మాట్లాడుతున్న వేముల నరేందర్

కందనూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బోధనారుసుములు, ఉపకార వేతనాలు చెల్లించకుండా వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని భాజపా జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు విమర్శించారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజుల బకాయి-భాజపా లడాయి' పేరిట ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 15 వేల కోట్ల బకాయిలు ఇప్పటి వరకు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఒక వైపు రైతుల ఆత్మహత్యలు, మరో వైపు ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా... ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాగేందర్‌గౌడ్, నరేశ్‌చారి, వెంకటేశ్, పద్మ యాదవ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించాలని వినతి: కొల్లాపూర్, న్యూస్‌టుడే: కొల్లాపూర్‌లోని వరిదేల మూలవాగు వద్ద ఉన్న వైకుంఠధామంలో పెరిగిన కంపచెట్లను తొలగించాలంటూ 10వ వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేశ్, 15వ వార్డు కౌన్సిలర్ మానపాడు నరసింహ శనివారం కొల్లాపూర్ పురపాలిక కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రెడ్డిజ్యోతి, వైస్‌ఛైర్మన్ షేక్‌రహీంపాషను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం: లింగాల, న్యూస్‌టుడే: లింగాలలో ఇటీవల మరణించిన ఇరుకు శ్రీనివాసులు కుటుంబానికి స్థానిక ఉన్నత పాఠశాల 1992-1993 ఎస్ఎస్‌సీ బ్యాచ్ మిత్రులు శనివారం రూ. 31వేల ఆర్థిక సాయం అందజేశారు. కేబుల్ శ్రీను, రామకృష్ణ, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రిఫరీ శిక్షణలో ప్రతిభ: అచ్చంపేట, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రంలో నిర్వహిస్తున్న తైక్వాండో జాతీయస్థాయి రిఫరీ శిక్షణ కార్యక్రమంలో అచ్చంపేటకు చెందిన క్రీడాకారుడు రాజు రాథోడ్ ప్రతిభ చాటాడు. తంజావూరు జిల్లా పాపనాశంలో శనివారం నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో రిఫరీ శిక్షణలో పాల్గొన్నాడు. స్థానిక క్రీడాకారులు ఆయన్ను అభినందించారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించండి: అమ్రాబాద్, న్యూస్‌టుడే: పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్య, వైద్యం కోసం ఈ నెల 31న మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం అమ్రాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బాలయ్య, సాయిలు, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ యూనిట్ వద్దని విన్నపం
కల్వకుర్తి, న్యూస్‌టుడే: మార్చాల గ్రామంలో ఏర్పాటు చేయనున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ రద్దు చేయాలని పంచాయతీ పాలకవర్గం తహసీల్దార్ ఇబ్రహీంను కలసి వినతిని అందించింది. శనివారం 'సర్'పై ఏర్పాటు చేసిన గ్రామసభకు తహసీల్దార్ హాజరయ్యారు. పంట పొలాల మధ్య ప్లాస్టిక్ రీ-సైక్లింగ్ యూనిట్ ఏర్పాటుతో ఆ ప్రాంతమంతా కాలుష్యమయం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప సర్పంచి నిజామోద్దీన్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ ఐకాస సభ్యులు పాల్గొన్నారు.

వినతిని అందిస్తున్న సర్పంచి కృష్ణారెడ్డి

వైద్య శిబిరం విజయవంతం: లింగాల, న్యూస్‌టుడే: అంబడిపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో కోమటికుంట గ్రామంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. పీహెచ్‌సీ వైద్యాధికారి డా.జయచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో 110 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, రాంచందర్, హాతిరాం, కమలాదేవి పాల్గొన్నారు.

పరామర్శ..: వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పి.శ్రీశైలం, పెద్దాపూర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన నర్సమ్మ భౌతికకాయాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. చెర్కూర్‌లో కుటుంబ సభ్యులతో గోలి దశరథ్‌రెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజితరెడ్డి, సర్పంచి శ్రీనువాసులు, నాయకులు పాల్గొన్నారు.

కియోస్క్ ప్రారంభం: తెలకపల్లి, న్యూస్‌టుడే: వట్టెం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఎస్బీఐ ఆధ్వర్యంలో కియోస్క్‌ను శనివారం బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన బ్యాంక్ సేవలు వివరించారు. ఆలయ ట్రస్టీ ఎస్.ప్రతాప్ రెడ్డి, కమిటీ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి, బ్యాంక్ ప్రాంతీయ ప్రబంధకులు చరణ్ బొంపాడ, చీఫ్ మేనేజరు నరేంద్రనాథ్‌రెడ్డి, బ్రాంచి మేనేజరు గుండి మధుశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించండి
అచ్చంపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదురుచూస్తున్న వేతన సవరణను ఉత్తమ ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

దేశ రక్షణకు నడుంబిగించాలి

వెల్దండ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ దేశ రక్షణకు నడుంబిగించాలని ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ పర్యావరణ ప్రముఖ్ దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెల్దండ బ్రహ్మగిరి ఆలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు దేశ రక్షణకు పాటుపడటంతో పాటు హిందూధర్మాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం నీవు నాకు, నేను నీకు రక్ష...మనిద్దరం దేశానికి రక్షంటూ రాఖీలు కట్టుకున్నారు. ఖండ కార్యవాహ రాజ్‌కుమార్‌జీ, ప్రముఖ్‌లు శోభన్‌బాబుచారి, శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

అభిషేకంలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే: బిజినేపల్లి మండలం నందివడ్డేమాన్‌లోని శనీశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో శనీశ్వరునికి తిల, తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పరమశివుడికి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే: బిజినేపల్లి మండలం గంగారం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కొములయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రాములునాయక్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

తాడూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం సీపీఎం నాయకులు ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి అంతటికాశన్న మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది కొరత, డిప్యుటేషన్ల రద్దు, అంబులెన్స్ ఏర్పాటుతో పాటు ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నుపోతుల కాశన్న, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు.. అచ్చంపేటలో నివాళులు అర్పిస్తూ

తెలుగుపై ఆసక్తి పెంచుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తెలుగుపై ఆసక్తిని పెంచుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ సైన్సు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మదన్‌మోహన్ తెలిపారు. శనివారం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించి గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యాపకులు రాఘవేందర్, అంజయ్య, వనిత, ఉమాదేవి, కోదండరాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషావేత్త, వ్యవహారిక భాష ఉద్యమకారుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జీహెచ్ఎం జీవన్‌కుమార్, ఉపాధ్యాయులు శంకరయ్య, కృష్ణయ్య, స్వరూప, మాధవి పాల్గొన్నారు.

సహకారం అందించడం అభినందనీయం

కందనూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జానపద కళాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 600 మంది కళాకారులతో కళారూపాలు ప్రదర్శన నిర్వహించినట్లు పేర్కొన్నారు. యువ కళా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కళాకారులు కవిత, సునీత, కృష్ణగౌడ్, రాము, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్

కొల్లాపూర్, న్యూస్‌టుడే: పురపాలికల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శివవర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పురపాలిక కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని పుర కమిషనర్ శంకర్‌కు అందజేశారు. వెంకటరమణ, గోవిందమ్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను ఎంచుకుని ముందుకెళ్లాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్ తెలిపారు. పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతులను అందజేసి అభినందించారు. పదిలో నక్షత్ర 571, షణ్ముఖప్రియ 568, ఇంటర్‌లో ప్రణదీప్ 983, మణిదీప్ 947 మార్కులు సాధించారు. వీరికి మార్కండేయ సముదాయ భవనంలో శాలువా కప్పి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. రమేశ్, శ్రీనివాసులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులో డీజే పెడితే కేసులు

కల్వకుర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: బోనాల సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో డీజేలు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎస్.కురుమూర్తి హెచ్చరించారు. కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది బోనాల పండుగ సందర్భంగా డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 12 మందిని శనివారం తహసీల్దార్ ఇబ్రహీం ముందు బైండోవర్ చేశారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున సొంత పూచీకత్తు రాయించుకొని విడుదల చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆధారాలు ఇవ్వాలి: వెల్దండ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ కార్తిక్‌కుమార్ తెలిపారు. వెల్దండ మండలం చెర్కూర్, బర్కత్‌పల్లి గ్రామాల్లో శనివారం గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు.

నేడు కల్వకుర్తిలో 2కె రన్ పోటీలు

కల్వకుర్తి, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తిలో 2కె రన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే 2కె రన్‌ను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 2కె రన్ ఏర్పాటు చేశామన్నారు. 14 ఏళ్లు దాటిన వారు ఓపెన్ కేటగిరీలో పాల్గొనాలని చెప్పారు. హైదరాబాద్ చౌరస్తాలో ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హాజరవుతున్నట్లు వివరించారు. 2కె రన్ పోటీలకు క్రీడాకారులు సకాలంలో చేరుకోవాలన్నారు.

ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీ.. ఆరుగురికి గాయాలు
ఉప్పునుంతల, న్యూస్‌టుడే: మండలంలోని దేవదారికుంట తండాలో గ్రామపంచాయతీ ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. డోజర్‌తో ఉన్న పంచాయతీ ట్రాక్టర్ వీధిలో నుంచి వస్తుండగా ద్విచక్రవాహనం ఎదురుగా వెళ్లడంతో ఢీకొన్నాయి. ధర్మనాయక్ ద్విచక్రవాహనంపై భార్య జ్యోతి, కుమార్తెలు రాజేశ్వరి, బిందు, స్పందన, కుమారుడు గాంధీలతో కలిసి అచ్చంపేటకు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడినవారిని అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేశారు. ధర్మ, రాజేశ్వరి, బిందు, స్పందనలకు తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బ్రహ్మయ్య తెలిపారు.

బొలెరో డ్రైవర్‌పై కేసు: వెల్దండ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారుడి మృతికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్దండ ఎస్సై యుగేంధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28న రాత్రి వెల్దండ మండల కేంద్రానికి చెందిన ద్విచక్రవాహనదారుడు పి.శ్రీశైలాన్ని(35) వాహనంతో ఢీకొట్టాడని మృతుడి భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు శనివారం అచ్చంపేట మండలం బొమ్మనపల్లికి చెందిన డ్రైవర్ కె.కల్యాణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు: కందనూలు, న్యూస్‌టుడే: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన రామస్వామి శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం: లింగాల, న్యూస్‌టుడే: మండలంలోని అంబడిపల్లికి కొద్ది దూరంలో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం మండలంలోని శాయినిపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకొన్న పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేశామని హెచ్‌సీ పేర్కొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్: కందనూలు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో గొర్రెలు మేపుతున్న పాశం నాగయ్యపై దాడికి పాల్పడి రెండు గొర్రెలను చంపిన రమేశ్‌రావుపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం బాధితుడితో కలిసి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి యోగక్షేమాలకు పోరాడే దమ్ము టీఎంయూకే సాధ్యమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి ఆర్టీసీ డిపోను సందర్శించి వారు మాట్లాడారు. ముందుగా పాలమూరు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి కార్మికులు, ఉద్యోగులు నినాదాలు చేస్తూ డిపో వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను గజమాలతో సన్మానించారు. డిపోలోని వివిధ సెక్షన్లను తిరిగి పరిశీలించారు. అమరులైన ఆర్టీసీ కార్మికుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. డిపోలోని కార్మిక నాయకులు రవి, జగదీశ్వర్, సదానంద్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న రెడ్డి, చిత్రంలో అధ్యక్షుడు శంకర్

(c) eenadu